సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 18 । మే । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 46.231 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 186 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,609
3 శాతం జీఎస్టీతో	రూ.5,777
నవర (8 గ్రా)	రూ.46,216

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.4 /31.4

బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో 41 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో మధ్యాహ్నం తర్వాతా ఓపీ సేవలు

- నేటి నుంచే అమలు



మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో గురువారం నుంచి రోజూ మధ్యాహ్నం తర్వాత 3 నుంచి 4 గంటల వరకు కూడా ఓపీ సేవలు అందుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. బుధవారం ఆయన ఆస్పత్రిలో వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు బోధనాస్పత్రిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ సేవలు అందేవన్నారు. అనంతరం మెడికల్ స్టూడెంట్స్‌కు తరగతులు, రోగుల వద్దకు రౌండ్స్ తదితర కార్యక్రమాలుండేవన్నారు. ఎవరికైనా అత్యవసర వైద్యం అవసరమైతే మధ్యాహ్నం నుంచి ఎమర్జెన్సీ వార్డులో సేవలు పొందేవారన్నారు. తాజాగా మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు వైద్య సేవలను పక్కాగా అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. తల్లీబిడ్డల వార్డులో డెలివరీల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. డాక్టర్ల పర్యవేక్షణ, ఓపీ రోగుల సంఖ్య తదితర వివరాలు నమోదు చేసి ఏరోజుకారోజు డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కు పంపుతామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ముమ్మరంగా పొగాకు కొనుగోళ్లు



వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో రైతుల ఉత్పత్తుల కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం రైతులు 820 బేళ్ల వేలానికి తీసుకురాగా 13 కంపెనీల బయ్యర్లు 804 బేళ్లు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 16 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.180 ధర లభించింది. మొత్తంగా 99,638 కిలోల పొగాకును రూ.1.39 కోట్లతో కొనుగోలు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాగా 19, 20 తేదీల్లో జరగాల్సిన దుత్తలూరు, గుండెమడగల క్లస్టర్ల పరిధిలోని వేలంపాటలను ఒకరోజు ముందుకు జరిపి 20, 22 తేదీలకు మార్చారు.

కలిగిరి సీఐగా ఫిరోజ్

నెల్లూరు(క్రైమ్): కలిగిరి సీఐగా పనిచేస్తున్న ఎస్.సాంబశివరావు రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు సీఐగా పనిచేస్తున్న ఎండీ ఫిరోజ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(టౌన్): జిల్లాలోని హైస్కూల్ ప్లస్ (బాలికలు) పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో సబ్జెక్ట్‌ల వారీగా బోధన చేసేందుకు దరఖాస్తులు సమర్పించిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. గురువారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉదయం పది గంటలకు ఈ ప్రక్రియ జరుగుతుందని డీఈఓ గంగాభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ తదితర సబ్జెక్ట్‌లు బోధించేందుకు దరఖాస్తులు సమర్పించిన టీచర్లు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు ప్రవేశపరీక్ష 20న

నెల్లూరు(వేదాయపాళెం): ఏపీ గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు ఈనెల 20న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నామని ఏపీ గురుకుల మైనార్టీ బాలుర పాఠశాల ప్రిన్సిపల్ టి.కామేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం కోసం ఆరోజు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం కోసం అదేరోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఏపీఆర్ఎస్ సీఎటీ అండ్ ఏపీఆర్‌జేసీ అండ్ డీసీసెట్-2023 కింద ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారికి కేటాయించిన సెంటర్లకు ఒక గంట ముందుగా వెళ్లాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని రాకూడదన్నారు. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదని తెలియజేశారు.

గిరిజన ఉత్పత్తులు అదరహో



- వేసవితాపం తీర్చే షర్బత్‌కు డిమాండ్
- శ్రీలక్ష్మీ నరసింహ యానాది మండల సమాఖ్య ఏర్పాటు
- వెలుగొండ అడవుల్లో ముడిసరుకుల సేకరణ
- ఇంకా ఉసిరి క్యాండీలు, ఊరగాయల తయారీతో ఆర్థిక ప్రగతి
- పెంచలకోన నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్ పేరుతో ఆన్‌లైన్ విక్రయాలు

అక్కడ ఓ వైపు ఉసిరికాయలు ఆరబెట్టి ఉంటారు. మరోవైపు షర్బత్ తయారీ కోసం మారేడు గడ్డల్ని ప్రాసెసింగ్ చేస్తూ ఉంటారు. కొంతమంది ఎండిన ఉసిరికాయలతో నోరూరించే క్యాండీలు తయారు చేస్తూ కనిపిస్తారు. ఇంకొందరు వేసవి తాపం తీర్చే నన్నారి షర్బత్‌ను బాటిల్స్‌లో నింపుతూ నిమగ్నమై ఉంటారు. ఇవన్నీ చేసేది నిష్ణాతులైన రాపూరు మండల గిరిజనులు. వెలుగొండల్లో దొరికే అటవీ ఫల సాయాన్ని సేకరించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.



షర్బత్‌ను బాటిళ్లలో నింపుతున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వెలుగొండలను ఆనుకుని ఉన్న రాపూరు మండలంలో గిరిజనులు అధికంగా ఉన్నారు. స్థానికంగా లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను నమ్ముకుని జీవిస్తుంటారు. వీరంతా సంఘటితంగా ఏర్పడి గ్రామస్థాయి సంఘాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆపై శ్రీలక్ష్మీనరసింహ యానాది మండల సమాఖ్య పెట్టారు. జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు 275 మంది వన్ ధన్ వికాస కేంద్రం (వీడీవీకే) పెట్టి అటవీ ఫల సాయం సేకరిస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి కావాల్సిన శిక్షణ, తయారీ, మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు.

ఇలా కూడా..

జనవరి నుంచి మార్చి నెల వరకు వెలుగొండ అడవుల్లో ఉసిరికాయల సేకరణ జరుగుతుంది. సీజన్లో సుమారు 20 టన్నుల కాయలను సేకరిస్తుంటారు. 150 కుటుంబాల వరకు దీనిపై ఆధారపడి ఉన్నాయి. సేకరించిన ఉసిరికాయలను కేజీ రూ.30 చొప్పున వ్యాపారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తుంటారు. ఇంకా ఉసిరికాయలతో ఉసిరి క్యాండీలు తయారు చేస్తారు. మూడు కేజీల ఉసిరికాయలతో ఒక కేజీ క్యాండీలు చేస్తారు. వీటి విలువ మార్కెట్లో రూ.500గా ఉంది. ఇందులో పోషక విలువలు అధికంగా ఉంటాయి. ఉసిరి క్యాండీల తయారీలో సుమారు 30 మంది గిరిజనులు శిక్షణ పొందారు. తయారీ ఖర్చు పోగా మిగిలిన నగదును సమంగా పంచుకుంటూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. అలాగే నిమ్మకాయలతో ఊరగాయ తయారీ, స్వచ్ఛమైన తేనెను సేకరించి విక్రయాలు చేస్తున్నారు.

షర్బత్ తయారీ

శ్రీలక్ష్మీ నరసింహ యానాది మండల సమాఖ్యలోని సభ్యుల్లో సుమారు 30 మంది నన్నారి షర్బత్ తయారీలో నిష్ణాతులుగా ఉన్నారు. అలాగే 150 మంది షర్బత్ తయారీకి కావాల్సిన మారేడు గడ్డలను సేకరించి ప్రాసెసింగ్ చేస్తుంటారు. గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసులు, వెలుగు సుబ్బయ్య, యాకసిరి జయరామయ్య, నారాయణ, నల్లు శివ మొదలగు వారు ఈ షర్బత్ తయారీలో నిష్ణాతులుగా ఉన్నారు. జనవరి నుంచి జూన్ నెల వరకు నన్నారి షర్బత్ తయారీపై దృష్టి పెడుతుంటారు. దీనికి కావాల్సిన మారేడు గడ్డలను వెలిగొండ అడవుల్లో జనవరి నుంచి మే నెల వరకు సుమారు 10 నుంచి 15 టన్నుల వరకు సేకరిస్తారు. సాధారణంగా ఒక కేజీ గడ్డల విలువ రూ.400 ఉంది. ఒక కేజీ నుంచి 30 లీటర్ల షర్బత్ తయారు చేస్తారు. మార్కెట్లో ఒక లీటర్ షర్బత్ రూ.160గా ఉంది. దినుసులు, తయారీ ఖర్చు, లేబర్ వంటి వాటిని తీసి వేయగా మిగిలిన మొత్తాన్ని గిరిజనులు సమంగా పంచుకుంటూ ఆర్థికంగా పురోగమిస్తున్నారు.

మార్కెటింగ్ సదుపాయం ఇలా..

గిరిజనులు తయారు చేసిన అటవీ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. పెంచలకోన నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. దీనికి మంచి డిమాండ్ ఉంది. ఇంకా ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ చేసేలా ఒప్పందం చేసుకున్నారు. ఎటువంటి కల్తీ లేని అటవీ ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి రావడంతో ప్రజలు ఆదరిస్తున్నారు. ఈ ఫల సాయంతో మండలంలోని సుమారు 1,500 మందికి పైగా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

లాభదాయకంగా ఉంది



కేజీ కుంకుళ్లను రూ.20కు అమ్ముతుంటారు. అదే విత్తనాలు వేరు చేసి అమ్మితే కేజీ రూ.140 వస్తుంది. ఉసిరి కేజీ రూ.30 ఉంటుంది. అదే ఆమ్ల క్యాండీ చేసి అమ్మితే కేజీ రూ.500 వరకు వస్తుంది. మారేడు కూడా కేజీ రూ.350 పలుకుతుంది. అదే నన్నారి షర్బత్ చేసి అమ్మితే రూ.2,500 వస్తుంది. ఇలా లాభదాయకంగా ఉంది.

– వెలుగు సుబ్బయ్య, వన్‌ధన్ వికాస కేంద్రం అధ్యక్షుడు

అందరం సంపాదిస్తున్నాం



వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా ఇంట్లో ఉన్న ప్రతిఒక్కరికీ పని దొరుకుతోంది. అలాగే ఇంటిల్లిపాదీ సంపాదిస్తూ ఆనందంగా జీవిస్తున్నాం. డీఆర్‌డీఏ, ఐటీడీఏ, జీసీసీ వారు మాకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు సాయం చేశారు. వారికి రుణపడి ఉంటాం.

– గాలి శ్రీనివాసులు, వన్‌ధన్ వికాస కేంద్రం కార్యదర్శి



ఉసిరిని ఆరబెడుతున్న మహిళలు

విద్యాసంస్థల బస్సులకు ఎఫ్‌సీ తప్పనిసరి

- డీటీసీ చందర్

నెల్లూరు(టౌన్): విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అని డీటీసీ చందర్ తెలిపారు. నెల్లూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో బస్సుల డ్రైవర్లు, విద్యాసంస్థల యజమానులకు బుధవారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ విద్యార్థుల రక్షణ కోసం అనేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో విద్యాసంస్థలు యాజమాన్యాలు మరింత బాధ్యతగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో ఏ విధంగా డ్రైవర్ స్పందించాలనే విషయంపై వివరించారు. ఎమర్జెన్సీ డోర్ ఆవశ్యకత, అగ్నిమాపక పరికరం ఎలా వినియోగించాలి తదితర అంశాలను వీడియోల ద్వారా తెలియజేశారు. ఈనెల 15వ తేదీతో ఎఫ్‌సీ ముగుస్తుందన్నారు. అందువల్ల ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం ఆ సర్టిఫికెట్ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్ పవన్, బాబు, ఏఓ కిశోర్, ఏఎంవీఐలు స్వప్నిల్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీసీ చందర్

‘జగనన్నకు చెబుదాం’పై అశ్రద్ధ వద్దు

- కలెక్టర్ హరినారాయణన్

కందుకూరు: ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని, దీని విషయంలో అశ్రద్ధగా ఉండొద్దని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి జేసీ కూర్మనాథ్, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై నిర్ణీత సమయంలోగా స్పందించాలన్నారు. అంతిమంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. సమస్యను సరైన విధంగా పరిష్కరించకుండా గడువు సమీపిస్తుందని పరిష్కరించినట్లు చూపితే సంబంధిత అధికారులపై తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. గత వారంలో రీఓపెన్ అయిన అర్జీలపై శాఖల వారీగా సమీక్షిస్తూ పోలీస్, నెల్లూరు నగరపాలక సంస్థ శాఖల కృషిని అభినందించారు. అలాగే రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి జేసీ వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని పని చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సచివాలయాల నిర్వహణ ఉండాలన్నారు. కచ్చితంగా వారంలో నాలుగురోజులు వాటిని తనిఖీ చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. మొక్కుబడిగా కాకుండా విధి విధానాలకు అనుగుణంగా సచివాలయాలు పనిచేసేలా చూడాలన్నారు. లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈకేవైసీని వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను కలెక్టర్ హరినారాయణన్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాల గురించి, రోగులకు అందిస్తున్న సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. పేద ప్రజల వైద్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోండి

లింగసముద్రం: జగనన్న లేఅవుట్లల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పిలుపునిచ్చారు. మండలంలోని పెంట్రాల, లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాళెం వద్ద ఉన్న జగనన్న లేఅవుట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం మంచి అవకాశం ఇచ్చిందన్నారు. స్థలాలు ఉన్నవారు ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. లేఅవుట్లలో మౌలిక వసతులు విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం లింగసముద్రం, బలిజపాళెంలో రక్తహీనత ఉన్న మహిళ, వయసుకు తగిన బరువు లేని పిల్లలను చూసి వైద్యాధికారులు మీకు సూచనలు, సలహాలు ఇస్తున్నారా? లేదా? ఆరాతీశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శోభిక, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ నాగరాజు, తహసీల్దార్ సుధాకర్‌రావు, ఎంపీడీఓ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఇంటి లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

రక్తపోటు ప్రాణాంతకం

బీపీ వ్యాధిగ్రస్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. సైలెంట్ కిల్లర్ అయిన బీపీ(అధిక రక్తపోటు) వల్ల పక్షవాతం రావచ్చు. గుండె, ఊపిరితిత్తులు దెబ్బతినొచ్చు. మెదడులో రక్తనాళాలు చిట్లవచ్చు. లేదా మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టవచ్చు. అంతిమంగా ప్రాణాంతకం కావచ్చు. బీపీ ఉన్న వారికి షుగర్ వచ్చే అవకాశం ఎక్కువ. అలాగే షుగర్ ఉన్న వారికి బీపీ వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే ఈ రెండింటిని జంటజబ్బులుగా డాక్టర్లు చెబుతుంటారు. బీపీ ఉన్న వారు అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల బీపీని నియంత్రించుకోవచ్చని వైద్యులు వెల్లడిస్తున్నారు.



- ఒత్తిడి, ఆహార అలవాట్లు, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం ప్రధాన కారణం
- బీపీ, షుగర్ ఒకటి ఉంటే మరొకటి వచ్చే అవకాశం
- అవగాహన, జాగ్రత్తలే అసలైన మందు



వృద్ధుడి బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): బీపీ వ్యాధిగ్రస్తులు క్రమేపీ పెరుగుతుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రతి సంవత్సరం మే నెల 17వ తేదీన ప్రపంచ రక్తపోటు దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. ఈ సంవత్సరం ‘ఒత్తిడిని తగ్గించుకుందాం’ అనే నినాదాన్ని ఇచ్చింది. అందులో భాగంగా జిల్లాలో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించి బీపీని అదుపులో ఉంచుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రతి ఆరునెలలకు..

ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ చేసే పనిలో, ఉద్యోగంలో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రధానంగా బీపీ, షుగర్ వస్తున్నాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 100 మందిలో 15 మందికి బీపీ ఉన్నట్లు ప్రభుత్వ లెక్కల ద్వారా తెలిసింది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి 100 మందిలో 20 మందికి బీపీ ఉంది. జిల్లాలో మొత్తంగా 4 లక్షల మంది బీపీ వ్యాధిగ్రస్తులున్నారు. అనేక మందికి తమకు బీపీ ఉన్నట్లు అసలు తెలియదు. తల తిరుగుతున్నట్లు.. నీరసంగా ఉన్నట్లు.. తలనొప్పి ఉన్నట్లు అనిపించి ఆస్పత్రికి వెళితే డాక్టర్ చెక్ చేయగా అప్పటికే బీపీ ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ పరిస్థితి పోవాలంటే 30 ఏళ్లు దాటిన వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారైనా బీపీ చెక్ చేయించుకోవాలని డాక్టర్లు చెబుతున్నారు.

సాధారణ రక్తపోటు 120/80

మనిషికి సాధారణంగా రక్తపోటు 120/80 ఉండాలి. ఈ రక్తపోటు వయసును బట్టి కాస్త అటూ ఇటూ ఉండవచ్చు. వయసును బట్టి స్టేజ్-1 కింద 140/90, స్టేజ్-2 కింద 160/100 కూడా ఉండొచ్చు. అలాగే బీపీ తక్కువ ఉన్నా ఇబ్బందులు తప్పవు. కొంతమంది ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ 160/90 ఉంటూ అది కాస్త 110/70కి తగ్గితే లో బీపీగా పరిగణించాలి. బీపీ వయసును బట్టి కంట్రోల్‌లో ఉంచుకోవాలి.

అధిక రక్తపోటు కారణంగా..

బీపీ వల్ల గుండెజబ్బులు వస్తాయి. మూత్రపిండాల వ్యాధి, కంటి జబ్బు, మెదడు రక్తనాళాల జబ్బులు, పక్షవాతం, విపరీతమైన తలనొప్పి, గుండె రక్తనాళాల జబ్బులు రావొచ్చు. తలనొప్పి, తల తిరుగుతున్నట్టు, తూలుతున్నట్టు, కూర్చున్న స్థితి నుంచి నిలుచోగానే కళ్లు బైర్లు కమ్మడం, సాధారణంగా శ్వాస తీసుకోలేకపోవడం లాంటి లక్షణాలుంటే బీపీగా గుర్తించి డాక్టర్‌ను సంప్రదించాలి. లో బీపీ ఉన్నట్లయితే నీరసం, అలసట, సరిగా నిద్రలేకపోవడం, మానసికంగా కృంగిపోవడం, తలనొప్పి, గుండె వేగంగా పనిచేయడం, నాడి అధికంగా కొట్టుకోవడం, అరికాళ్లు, అరిచేతులు చల్లగా ఉండి చెమటలు పట్టడం తదితర లక్షణాలుంటాయి. లో బీపీ వల్ల ఒక్కోసారి షాక్‌లోకి వెళ్లి ప్రాణాపాయం జరగవచ్చు.

వివరాలిలా..

జిల్లాలో : సుమారు 4 లక్షల మంది


గ్రామీణ ప్రాంతాల్లో :
ప్రతి 100 మందిలో 15 మంది

పట్టణ ప్రాంతాల్లో :
ప్రతి 100 మందిలో 20 మంది

జాగ్రత్తలు తప్పనిసరి

నలభై ఏళ్లు పైబడిన వారు ప్రతి సంవత్సరం పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా బీపీ ఉంటే కనీసం ఆరు నెలలకొకసారి బీపీ చెకప్ చేయించుకోవాలి. షుగర్ వ్యాధి ఉన్న వారు, కొలెస్ట్రాల్ ఉన్న వారు వాటిని కంట్రోల్‌లో ఉంచుకోవాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. ప్రధానంగా ఒత్తిడి తగ్గించుకోవాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

అవగాహన అవసరం



ప్రస్తుత యాంత్రిక జీవనంలో తీసుకునే ఆహారం, ఒత్తిడి వల్ల వయసుతో సంబంధం లేకుండా తక్కువ వయసులోనే ప్రజలు బీపీ బారిన పడుతున్నారు. అందువల్ల ప్రజలు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి. ప్రతి రోజూ నడక ఆరోగ్యానికి మంచిది. 30 ఏళ్లు దాటిన వారు సంవత్సరానికి ఒకసారైనా బీపీ చెక్ చేయించుకోవాలి.

– డాక్టర్ గంగాధర్, ఎండీ, ఫిజీషియన్, లీడ్ ఆస్పత్రి

నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
- ట్రాఫిక్, నగర పోలీస్ అధికారులతో సమావేశం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నగర, ట్రాఫిక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, వన్‌వే, ఉల్లంఘనలపై చర్యలు తదితరాలపై బుధవారం ఆయన సమీక్షించి సూచనలు, సలహాలిచ్చారు. నగర జనాభా పెరుగుతుండడం, వివిధ ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు, విద్యాసంస్థలు, వాణిజ్య కేంద్రాలు ఉండడంతో ట్రాఫిక్ నిర్వహణ సవాల్‌గా మారిందన్నారు. ఆర్టీసీ బస్టాండ్, మద్రాస్ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆటోలు, సిటీ బస్సులు, ఇతర వాహనాలు నిలిపేలా చూడాలన్నారు. భారీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో నగరంలోకి అనుమతించరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను క్రమబద్ధీకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించడంతోపాటు ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాలన్నారు. మద్యం మత్తులోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిత్యం నిర్వహించాలన్నారు. మైనర్ డ్రైవింగ్, శబ్ద కాలుష్యం చేస్తున్న వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. స్వీయ రక్షణ చాలా అవసరమని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ డి.హిమవతి, నగర, ట్రాఫిక్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ సుభాన్, నగర, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎ.సురేంద్రబాబు, టీవీ సుబ్బారావు, కళ్యాణ్‌రాజ్, సీతారామయ్య, పీవీ నారాయణ, రాములునాయక్, మిద్దె నాగేశ్వరమ్మ, ఆర్ఐ రమణారెడ్డి, ఆర్ఎస్సైలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నిర్వహిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

వెండి నందిపై ఆది దంపతుల వైభవం



విశేషాలంకరణలో ఆది దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వెండి నందిసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో దీక్షా హోమం నిర్వహించారు. అనంతరం దేవస్థాన ప్రాకార మండపం వద్ద బలిహరణ పూజ చేశారు. రాత్రి ఆదిదంపతులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. శివునికి ప్రథమ భక్తుడు నంది. నందికి ఉన్న నాలుగు పాదాలను ధర్మానికి నాలుగు పాదాలుగా అభివర్ణిస్తారు. అందుకే ఈశ్వరుడు ధర్మానికి ప్రతిరూపమని భక్తుల విశ్వాసం. ఉభయకర్తలుగా చిల్లకూరు చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థంగా కుమారుడు విక్రమ్, నూకలపాటి రంగమ్మ జ్ఞాపకార్థంగా ఎండోమెంట్ వారు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8.30 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రికి గజ,సింహ వాహనాలపై ఆదిదంపతులు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

మాది చేతల ప్రభుత్వం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పిడూరులో బుధవారం ఆయన పర్యటించారు. రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటి షెల్టర్ భవనాలను ప్రారంభించారు. రూ.17.50 లక్షలతో చేపట్టనున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.23 లక్షలతో చేపట్టనున్న శ్మశాన వాటిక ప్రహరీ, టీటీడీ నిధులు రూ.10 లక్షలతో దళితవాడలో చేపట్టనున్న రామమందిరం నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ప్రభుత్వం అంటే ఎలా ఉండాలో మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

గతంలోని ముఖ్యమంత్రులు ఎన్నికల సమయంలో ఎన్ని హామీలు ఇచ్చారు..అధికారంలోకి వచ్చాక ఎన్నింటిని నెరవేర్చారనే విషయాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల కాలంలోనే ఇచ్చిన హామీలను 95 శాతానికిపైగా నెరవేర్చారని తెలిపారు. తమ ప్రభుత్వంలో మీ కుటుంబాలకు మంచి జరిగిందని అనుకుంటేనే తనకు అండగా నిలవండని అనగలిగిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ ఒక్కడేనన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఊరూరా సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ఒక్క అడుగు మట్టి రోడ్డు లేకుండా సీసీరోడ్లు వేశామన్నారు. మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పీఆర్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ శివనాయక్, ఏఈలు రవికుమార్, కార్తీక్‌రెడ్డి, ఏఓ జహీర్, నుడా చైర్మన్ బాపిరెడ్డి, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైస్‌ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	: రూ. 52
సన్నవి	: రూ. 22
పండ్లు	: రూ. 15

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

బుచ్చిరెడ్డిపాళెం: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. మండలంలోని చెల్లాయపాళెం సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు చెల్లాయపాళెం సచివాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు సమయాన్ని పాటించాలని కోరారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడడంతో పాటు వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడిచెత్తను వర్మీకంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి నారాయణ ఉన్నారు.

మా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి

- పుట్టుకతోనే తలసేమియా బారిన పడిన బాలుడు
- శాశ్వత చికిత్సకు రూ.25లక్షలు ఖర్చవుతుందన్న వైద్యులు
- దాతల సాయం కోసం వేడుకుంటున్న తల్లిదండ్రులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిఖిల్

చేజర్ల: ఆ బిడ్డ పుట్టుకతోనే తలసేమియా వ్యాధి బారినపడ్డాడు. అప్పటి నుంచి ప్రతి నెలా రక్తమార్పిడి చేయిస్తూ బిడ్డను కాపాడుకుంటూ వస్తున్నారు తల్లిదండ్రులు. తలసేమియా వ్యాధి శాశ్వత నివారణకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాలని, అందుకు భారీగా ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేదలైన ఆ తల్లిదండ్రులు దాతల సాయం కోసం వేడుకుంటున్నారు. వివరాలు..చేజర్ల మండలం నాగులవెల్లటూరుకు చెందిన లక్కాకుల చంద్రశేఖర్, లక్ష్మి దంపతులు. వారికి ఇద్దరు కుమారులు. అందులో చిన్నవాడైన నిఖిల్ పుట్టుకతోనే తలసేమియా బారినపడ్డాడు. వైద్యుల సూచనల మేరకు గత పదేళ్లుగా నిఖిల్‌కు ప్రతినెలా రెడ్‌క్రాస్ సహకారంతో రక్తమార్పిడి చేయిస్తున్నారు. ఇటీవల నిఖిల్‌ను చెన్నైలోని రేలా ఆస్పత్రికి తీసుకెళ్లగా, బిడ్డ బతకాలంటే బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ శాశ్వత చికిత్స చేయించాలని, అందుకు రూ 25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నిఖిల్ తండ్రి టైలరింగ్ వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు. బిడ్డకు అంత మొత్తం ఖర్చు చేసి వైద్యం అందించలేక దాతల ఆపన్నహస్తం కోసం వేడుకుంటున్నారు. మానవత్వంతో సాయం అందించాలనుకునే దాతలు 6300 302274 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

పేకాట స్థావరంపై మెరుపు దాడి

- రూ.2.9లక్షల నగదు, రెండు కార్లు, బైక్‌ల స్వాధీనం
- 13 మంది అరెస్ట్

బిట్రగుంట: బోగోలు మండలంలో కమ్మపాళెంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం మెరుపుదాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో కావలి రూరల్ సీఐ రాజేష్, బిట్రగుంట ఎస్సై ఆదిలక్ష్మి తమ సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.2.9 లక్షల నగదుతో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులను స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు
- కరోనా సమయంలో 51,488 మంది ఉద్యోగులకు జీతాలు చెల్లించారు
- ప్రజారవాణా సంస్థ(పీటీడీ) డైరెక్టర్ ఏ రాజారెడ్డి



రాజారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ప్రజారవాణా సంస్థ డైరెక్టర్ రాజారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆర్‌ఎం కార్యాలయంలో ఆర్టీసీ అధికారులు, వివిధ అసోసియేషన్ల నాయకులు, విశ్రాంత ఉద్యోగులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రజారవాణా విభాగంలోని 51,488 మంది సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించారన్నారు. కరోనా కష్టకాలంలో బస్సులు ఒక్క కిలోమీటరు తిరగకపోయినా ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించి కుటుంబాలను ఆదుకున్నారని కొనియాడారు. ఆయనకు పీటీడీ ఉద్యోగులు కృతజ్ఞత పూర్వకంగా ఉండాలని కోరారు. గతంలో చంద్రబాబు ఆర్టీసీ బస్సులను పార్టీ కార్యక్రమాలు, పోలవరం సందర్శనకు వాడుకుని సుమారు రూ.72 కోట్లు చెల్లించకుండా వెళ్లారని తెలిపారు. గన్నవరంలోని ఆర్టీసీకి సంబంధించిన 28 ఎకరాల భూమిని ధారాదత్తం చేశారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులను కుదించి ప్రైవేట్ బస్సులను ప్రోత్సహించి సంస్థ నష్టాలకు కారణమైన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని బహిరంగంగా ప్రకటించిన చంద్రబాబు 2016 నుంచి 2019 వరకు కారుణ్యనియామకాలు చేపట్టకుండా అన్యాయం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటి వరకు పీటీడీకి సుమారు రూ.9,864 కోట్లు అందించి ఆదుకున్నారని తెలిపారు. కారుణ్య నియామకాలు, నూతన బస్టాండ్ల నిర్మాణం, నూతన బస్సుల కొనుగోలు, ఉద్యోగుల బకాయిలు చెల్లింపు, రూ.2500 కోట్ల సంస్థ అప్పులు చెల్లించేందుకు అంగీకరించారని చెప్పారు. ప్రజారవాణా సంస్థను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ విశాల హృదయంతో సహకరిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏపీపీటీడీ మరింత అభివృద్ధి చెంది స్వయం ఆర్థిక పరిపుష్టితో రాబోవు రోజుల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం ఖాయమన్నారు. నెల్లూరు జోన్ ఆర్టీసీ పాలక మండలి సభ్యురాలు సుప్రజారెడ్డి, నెల్లూరు జోన్ ఈడీ ఆదాం సాహెబ్, జిల్లా ప్రజారవాణాధికారి శేషయ్య, జిల్లా ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, పీటీడీ వైఎస్సార్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కేపీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 162

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



యాకసిరి శీనయ్య మృతదేహం

తోటపల్లిగూడూరు: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన కోడూరు పంచాయతీలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..కోడూరు పంచాయతీ పరిధిలోని కోనేటితోపు గిరిజన కాలనీకి చెందిన యాకసిరి శీనయ్య(22) కోడూరుకు చెందిన పల్లెకొండ వాసు అనే రైతు రొయ్యల గుంటల వద్ద కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం రొయ్యల గుంటల వద్ద ఉన్న టెంకాయ చెట్ల ఆకులను నరికి ట్రాక్టర్‌తో బయటకు తరలిస్తున్నారు. రొయ్యల గుంటలపైనున్న విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌కు తగులుతాయని శీనయ్య వాటిని సరిచేసే ప్రయత్నం చేశాడు. దీంతో విద్యుత్ వైర్లు చేతికి తగలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లిన కారు



ఐరన్ మెష్‌ను ఢీకొన్న కారు

- నెల్లూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

సింగరాయకొండ: ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పిన కారు రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లి ఐరన్ మెష్‌ను ఢీకొంది. ఈ ఘటన బుధవారం జాతీయరహదారిపై పెరల్ డిస్టిలరీ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు..నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న నెల్లూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ప్రత్యూష కారు పెరల్ డిస్టిలరీ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు మార్జిన్లోకి దూసుకెళ్లి ఐరన్‌మెష్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా డిప్యూటీ కమిషనర్ ప్రత్యూషకు స్వల్పగాయాలయ్యాయి. కారు డ్రైవర్ వెంకట శేషయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమా తెలిపారు.